ఆంధ్రజ్యోతి

**

ANDHRAJYOTHY

సూర్యాపేట

5

ఆదివారం 9 జూన్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్లు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.174	270	300
సూర్యాపేట	రూ.180	250	280
నల్లగొండ	రూ.170	246	280

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 । కనిష్ఠం 24.4



రెండు అండర్‌పాస్ మార్గాల్లో ఒక దాన్ని పూర్తిగా, రెండో దాంట్లో సగం వరకు ఏర్పాటుచేసిన దుకాణాలు

వైటీడీఏ పనులకు నిధుల కొరత

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి కొండపైన పాత నిర్మాణాలు తొలగించి ఆలయం మినహా ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని గత ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యేకంగా భక్తుల కొండ కింద దుకాణ సముదాయాల నిర్మాణాలను మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా వైటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టింది. ఆ పనులు చివరిదశలో నిధుల కొరతతో నిలిచాయి. ఎన్నికల కోడ్ ముగుస్తున్న నేపథ్యంలో నిధులు విడుదల అవుతుందొచ్చని వైటీడీఏ అధికారులు భావిస్తున్నారు. కాగా, ఇదే తరుణంలో 2026 వరకు కొండపై వర్తకం నిర్వహించేందుకు కోర్టు స్టే ద్వారా వర్తకులు అనుమతి పొందారు. ఈ మేరకు తాత్కాలికంగా 10 దుకాణాలు విష్ణు పుష్కరిణి ఎదురుగా ఉన్న అండర్‌పాస్‌తో పాటు ఆ పరిసరాల్లో గుడారాలు ఏర్పాటుచేసుకోగా, భక్తుల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది.

- భువనగిరి అర్బన్

» నిలిచిన దుకాణసముదాయాల నిర్మాణాలు

» ఆర్టీసీ బస్టాండ్ పనులు రూ.5 కోట్ల మేర పెండింగ్

భక్తుల సౌకర్యార్థం కావాల్సిన నిర్మాణాలు కొండ కింద చేపట్టేందుకు గండి చెరువు నుంచి ఊరకుంట చెరువు వరకు రెండు విడతల్లో 73, 78 నుంచి 119 సర్వేనంబర్ల వరకు తొలి విడతలో 93.03 ఎకరాలు, మలివిడతలో 49.24ఎకరాలు కలిపి 142.27 ఎకరాల వ్యవసాయ భూములను అప్పటి ప్రభుత్వం సేకరించింది. ఈ భూముల్లో తేపోత్సవం(గండి చెరువు) లక్ష్మీపుష్కరిణిని, ఆర్టీసీ బస్టాండ్, అన్నదాన సత్రం, కల్యాణ కట్ట, సత్యదేవుడి వ్రత మండపం, కొండపైన వ్యాపారులు, కొండకింద రోడ్డు బాధితుల కోసం దుకాణ సముదాయాలు నిర్మించగా, మిగిలిన భూములను పార్కింగ్ కోసం కేటాయించారు.

కోర్టు స్టేతో 10 దుకాణాలు

ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కొండపైన దుకాణాలు ఖాళీ చేయించగా జీవనోపాధి కోల్పోయామని వర్తకులు కోర్టును ఆశ్రయించగా కొండపైన 2026 వరకు 10 దుకాణాలకు కోర్టు అనుమతించింది. హోటళ్లు, కొబ్బరికాయల దుకాణాలు, జనరల్ దుకాణాలు, బొమ్మల దుకాణాలు, ఫొటో స్టూడియో తాత్కాలికంగా ఏర్పాటుచేసుకోగా, భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారానే 112 మంది వర్తకులు ఇక్కడ విడతల వారీగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

కొండకింద దుకాణ సముదాయాలు

దుకాణదారుల కోసం కొండకింద అన్నదాన సత్రం సమీపంలో 162దుకాణ సముదాయాలకు రూ.13కోట్లు కేటాయించగా, రూ.8కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. మరో రూ.5కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 166(నిర్వాసితుల కోసం బస్టాండ్ పక్కన వేరుగా) దుకాణ సముదాయాల కోసం రూ.60కోట్లు మంజూరు కాగా, రూ.50కోట్ల పనులు పూర్తయ్యాయి. రూ.10కోట్లతో నిర్మించాల్సిన ఆర్టీసీ బస్టాండ్ పనుల్లో రూ.5కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. ఎన్నికల కోడ్ ముగుస్తున్న నేపథ్యంలో నిధులు మంజూరు కావొచ్చని వైటీడీఏ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ దుకాణాల ఏర్పాటు స్థలాభావం కారణంగా విష్ణుపుష్కరిణి ఎదురుగా భక్తులు కాలినడకన వెళ్లే దారి(అండర్‌పాస్) లో ఏర్పాటుచేశారు. శివాలయం, ప్రసాదాల కౌంటర్, ప్రధానాలయానికి తూర్పుదిక్కు నుంచి భక్తులు నడిచే ప్రధాన దారి వెంట అండర్‌పాస్‌లో ఏర్పాటు చేయడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. రద్దీ దినాల్లో ఈ దారి వెంట భక్తులు నడవలేకపోతున్నారు. నిధులు విడుదల కాగానే చివరి దశ పనులు పూర్తి చేస్తామని వైటీడీఏ ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాత కొండకిందకు తరలించాల్సి దుకాణాలను అధికారుల ఆదేశాలతో నిర్ణయం తీసుకుంటామని ఆలయ పరిపాలన విభాగం ఏఈవో గట్టు శ్రావణ్‌కుమార్ తెలిపారు.



అండర్‌పాస్ మార్గాల్లో ఏర్పాటు చేసిన దుకాణాలు





దుకాణ సముదాయాలు దేవస్థానం ఆధీనంలోకి రాలేదు..

కొండకింద నిర్మించిన దుకాణసముదాయాలు వైటీడీఏ నుంచి దేవస్థానం ఆధీ నంలోకి రాలేదు. ప్రస్తుతం 2026 వరకు కొండపైన నిర్వహించుకునేందుకు కోర్టు స్టే ఉంది. 10దుకాణాలకు నెలవారీగా అద్దె రూ.12లక్షలతో పాటు జీఎస్టీ రూ.2,40,000 చెల్లిస్తున్నారు. దుకాణ సముదాయాల అప్పగింత, విధించిన కోర్టు స్టే ఎత్తివేత ప్రక్రియలు పూర్తి కాగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

- శ్రావణ్, గుట్ట దేవస్థానం పరిపాలన విభాగం ఏఈవో

నిధులు విడుదల కాగానే పనులు పూర్తి చేసి అప్పగిస్తాం..

162 దుకాణ సముదాయాల చివరిదశ పనులు నిధుల కొరతతో నిలిచాయి. నిధులు రాగానే పనులు పూర్తి చేసి అప్పగిస్తాం.అదేవిధంగా కొండకింద బస్టాండ్ పక్కన రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల కోసం 166దుకాణ సముదాయాలు కూడా నిర్మాణంలో ఉన్నాయి. నిధుల్లేక పెండింగ్‌లో ఉండగా సముదాయాల్లో పనులు పూర్తి కాగానే దేవస్థానం స్వాధీనం చేస్తాం.

- వెంకటేశ్వరరెడ్డి, వైటీడీఏ ఈఈ

ఉపాధ్యాయ బదిలీలు,పదోన్నతుల

ప్రక్రియ ఆలస్యం

» ఎన్నికల కోడ్ ఎత్తేశాకే కొనసాగనున్న ప్రక్రియ

» 10 నుంచి మొదలయ్యే అవకాశం



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఆలస్యం కానుంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఇంకా కొనసాగుతుండటంతో రెండు రోజులు ఆలస్యం కానుంది. ఈ నెల 10వ తేదీ సోమవారం నుంచి మొదలయ్యే అవకాశం ఉంది. ఆదివారం వరకు కూడా కోడ్ అమలులో ఉంది.

- నల్లగొండ

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసినా, జిల్లా విద్యాశాఖకు ఎలాంటి ప్రొసీడింగ్స్‌ను జారీ చేయలేదు. వాస్తవానికి శనివారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే కావడంతో రెండో శనివారం అయినా, ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయడమే కాకుండా ఇతర మార్గదర్శకాలను విడుదల చేసింది. అయితే కోడ్ కారణంగా ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈనెల 30వ తేదీ వరకు మల్టీజోన్-2లో పదోన్నతుల, బదిలీలను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే జారీ చేసిన నిబంధనల మేరకు షెడ్యూల్ ఉంటుందా? లేదా? మారుతుందా? అనే దానిపై ఉపాధ్యాయులపై సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ 8, 9వ తేదీల్లో జరగాల్సిన ప్రక్రియను 10వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు సమాచారం. ప్రక్రియ ప్రారంభం ఆలస్యం కానుండటంతో జూలై 1, 2 తేదీల వరకు చివరి గడువును పొడగించనున్నారు. తొలుత స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించి ఆ తరువాత బదిలీల ప్రక్రియ ప్రారంభిస్తారు. అనంతరం ఏర్పడిన స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను ఎస్జీటీలకు పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు. ఆ తరువాత ఎస్జీటీల బదిలీలు కొనసాగుతాయి.

గత మార్గదర్శకాలతోనే పదోన్నతులు, బదిలీలు

గత ఏడాది జారీ చేసిన షెడ్యూల్‌లో కటాఫ్ డేట్‌ను ఆగస్టు నెలాఖరు వరకు ప్రకటించారు. కోర్టు కేసుల కారణంగా ఆ ప్రక్రియ నిలిచింది. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ షెడ్యూల్‌నే పొడిగిస్తూ రీషెడ్యూల్‌ను ఈ నెల 7వ తేదీన విడుదల చేసింది. ఈ ఆరు నెల కాలంలో ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా మార్గదర్శకాలు లేవు. వివిధ వ్యాధులతో ఇబ్బందిపడుతున్న ఉపాధ్యాయులకు వెసులుబాటు కల్పించేలా, వివిధ కేటగిరీల్లో కేటాయించే పాయింట్ల విషయంలో స్పష్టత లేకపోవడంతో ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారు. మూడు ఏళ్లలోపు సర్వీస్ ఉన్న వారికి మినహాయింపు ఇచ్చినప్పటికీ రీషెడ్యూల్ జారీ చేసిన సమయానికి చాలా మంది ఉపాధ్యాయులు మూడేళ్ల సర్వీసు ఉండగా, ఈ విషయమై మార్గదర్శకాలు జారీ చేయలేదు. గతంలో మూడు సంవత్సరాల సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులందరూ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం వారు మూడు సంవత్సరాల సర్వీస్ లోపు కావడంతో ఎడిట్ ఆప్షన్ సౌకర్యం కల్పిస్తే యథాస్థానంలో ఉంటారు. లేని పక్షంలో స్థానచలనం జరుగుతుంది. ఈ విషయంలో కూడా పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉంది. ఒకవేళ ఎడిట్ ఆప్షన్ ఇస్తే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొత్తం ఆలస్యమయ్యే అవకాశం లేకపోలేదు. ఇది ప్రభుత్వంపరంగా తీసుకోవాల్సిన నిర్ణయం. కాగా, దీనిపై కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ఇప్పటికే ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది.

గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు

ఏర్పాట్లు పూర్తి

అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ప్రియాంక

సూర్యాపేటఅర్బన్, జూన్ 8: జిల్లాలో ఆదివారం నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయని అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాయి గౌతమి జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ఉదయం 8 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తామన్నారు. ఉదయం 9గంటల నుంచి అభ్యర్థుల బయోమెట్రిక్ నమోదు ఉంటుందన్నారు. 10గంటలకు కేంద్రం గేట్లు మూసివేస్తామని, ఆ తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులను అనుమతించేది లేదన్నారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. జిల్లా కేంద్రంలో మొత్తం 32 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 9,725 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో నిరంతర విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించామన్నారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులు, షూ ధరించి రావడం అనుమతిలేదన్నారు. మహిళలు బంగారు, వెండి ఆభరణాలు ధరించి పరీక్షకు రావొద్దన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తారన్నారు. ఆమె వెంట రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేషం, వై.లక్ష్మయ్యగౌడ్, తదితరులు ఉన్నారు.

గ్రూప్-1 అభ్యర్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం

గ్రూప్-1 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోదాడ నుంచి సూర్యాపేటకు ఉదయం 5గంటలకు, 5.45గంటలకు ఆ తరువాత ప్రతీ 15 నిమిషాలకు ఒక బస్సు ఉంటుందన్నారు. హుజూర్‌నగర్ నుంచి 6గంటలకు, 7గంటలకు బస్సులను అందుబాటులో ఉంచామన్నారు. తుంగతుర్తి నుంచి 6గంటలకు, 7.30 గంటలకు, 8గంటలకు, 8.30 గంటలకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. తిరుమలగిరి నుంచి 6.50గంటలకు, ఆ తరువాత ప్రతీ 20 నిమిషాలకు ఒక బస్సు సూర్యాపేటకు ఏర్పాటు చేశామన్నారు.

మూసీకి పుష్కల జలం..

కన్నీటి సాగరం

పూర్తిస్థాయి నీటిమట్టానికి 10 అడుగుల దూరంలో మూసీ

కనిష్ఠ నీటిమట్టానికి దిగువకు నాగార్జునసాగర్

హైదరాబాద్ జంట నగరాల నుంచి వచ్చే వృథా నీటికి, మూసీ ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షపు నీరు తోడవడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో పెద్ద నీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు జలకళను సంతరించుకుంటోంది. 623 అడుగుల కనిష్ఠ స్థాయి నుంచి మండు వేసవిలో సైతం ప్రాజెక్టు నీటిమట్టం 636.20 అడుగులకు చేరింది. ఈ క్రమంలో 40 రోజుల్లో మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 13 అడుగుల మేర పెరిగి వరద నీటితో ప్రాజెక్టు కళకళలాడుతోంది. నాగార్జునసాగర్‌లో దీనికి భిన్న పరిస్థితులు ఉన్నాయి. ప్రాజెక్టు కనిష్ఠ నీటిమట్టం 510 అడుగులు కాగా, దీనికి దిగువకు 504.70 అడుగుల వద్ద ప్రాజెక్టు నీటిమట్టం ఉంది.

- కేతేపల్లి, నాగార్జునసాగర్


వేసవిలో మండే ఎండలకు రాష్ట్రంలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు ఎండి బీటలు వారుతుంటే మూసీ ప్రాజెక్టు నీటిమట్టం మాత్రం ఒక్కో అడుగు పెరుగుతూ గరిష్ఠస్థాయికి 10 అడుగుల దూరంలో ఉంది. వానాకాలం నాటికే ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువలోకి వస్తుండటం, ఆయకట్టు రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు నీటిమట్టం గత నెల (ఏప్రిల్) 27వ తేదీ నాటికి 623.10 అడుగుల (0.67టీఎంసీలు) కనిష్ఠ స్థాయిలో ఉంది. ఈ క్రమంలో ఎగువ మూసీ నదికి ఇరువైపులా పరివాహక ప్రాంతాల్లోని ధర్మారెడ్డి కాల్వ, పిల్లాయిపల్లి, ఆసిఫ్‌నహర్ కత్వలు, ఇతర ఫీడర్ ఛానళ్లకు మళ్లించిన హైదరాబాద్ నగరం నుంచి వచ్చే డ్రైనేజీ, వృథా నీటితో చిట్యాల, రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాల్లోని పలు చెరువులు, కుంటలు నిండి ప్రస్తుతం అలుగు పోస్తున్నాయి. ఆయా చెరువులు, కుంటల అలుగుల నుంచి వచ్చే నీరంతా ప్రస్తుతం దిగువన ఉన్న మూసీ ప్రాజెక్టుకు చేరుతోంది. మరోవైపు హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న అకాల వర్షాలకు వరద మూసీ ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. దీంతో గత 40 రోజులుగా ప్రాజెక్టుకు 600 నుంచి 1,000 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం ఒక్కో అడుగు పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 636.20 అడుగులుగా(2.41 టీఎంసీలు) నమోదైంది. ఎగువ నుంచి 750.57 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 64.35 క్యూసెక్కుల మేర నీరు లీకేజీలు, ఆవిరి రూపంలో వెళ్తోంది. కాగా, గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 641.80 అడుగులు (3.47టీఎంసీలు)గా, ఇన్‌ఫ్లో 625 క్యూసెక్కులుగా ఉంది.

504అడుగుల వద్ద సాగర్

నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం గత ఆరేళ్లతో పోలి స్తే ఈ ఏడాది ఆందోళనకరంగా మారింది. ఆరేళ్ల క్రితం సాగర్ ప్రాజె క్టు నీటిమట్టం కనిష్ఠ స్థాయి 510 అడుగుల దిగువకు చేరుకుంది. తిరిగి ఈ ఏడాది కనిష్ఠ స్థాయి దిగువకు నీటిమట్టం చేరుకుంది. గత ఏడాది కృష్ణానది బేసిన్‌లో సరిపడా వర్షాలు పడకపోవడంతో ప్రాజెక్టు ల్లో కేవలం తాగు నీటి అవసరాలకు మాత్రమే నీరుంది. దీంతో సాగర్ ప్రాజెక్టు ఆయకట్టులో క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈ ఏడాదైన వరుణుడు కరుణించి ఆయకట్టుకు సాగు నీటి విడుదల ఉంటుందా అని రైతులు ఎదురుచూస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 504.70 అడుగులుగా (122.8483టీఎంసీలు)ఉంది. సాగర్ నుంచి జంట నగరాలకు తాగునీటి అవసరాలకోసం పుట్టగండి వద్ద ఎమర్జెన్సీ వద్ద మోటార్లద్వారా 800 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 800క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి ఎటువంటి నీటి రాక లేదు.



జలకళను సంతరించుకున్న మూసీ రిజర్వాయర్



వెలవెలబోతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్ట్

ముందస్తు వర్షాలు

ముమ్మరంగా వ్యవసాయ పనులు

నల్లగొండ: ఎన్నడూలేని విధంగా ఈఏడాది మే నెలలో అకాల వర్షాలు కురవడం, ఆతరువాత అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ఉమ్మడి జిల్లా అంతటా రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. మే నెలాఖరులో రోహిణి కార్తెలో వేసవిదుక్కుల్లో పత్తి విత్తనాలు కూడా విత్తారు.దీనికి తోడు నైరుతి రుతుపవనాలు ఏడాది ముందుగానే రావడంతో వేసవిలో పత్తివిత్తనాల వేసిన రైతులు గట్టెక్కారు. నల్లగొండ జిల్లాలో ఈనెల ఈనెల 8వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 20.9మి.మీకు 109 మి.మీ వర్షం కురిసింది. ఈనెల 8వతేదీవరకు మొత్తం429.5 మి.మీ వర్షం కురిసింది. నల్లగొండ డివిజన్‌లో 387.3మి.మీ, మిర్యాలగూడ డివిజన్‌లో 523.6, దేవరకొండ డివిజన్‌లో 492.3, చండూరు డివిజన్‌లో 232.9మి.మీ వర్షం కురిసింది. చాలాచోట్ల రైతులు వరి నార్లుపోయగా, ఇప్పటికే 60శాతానికి పైగా పత్తి విత్తనాలు విత్తారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి

సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌కుమార్



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌కుమార్

హుజూర్‌నగర్, జూన్ 8: పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతిప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టుహాల్‌లో మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లోక్‌అదాలత్‌తో ఇరు వర్గాలకు చెందిన కక్షిదారులు విజేతలవుతారన్నారు. సమాజాభివృద్ధికి ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. పంతాలు, పట్టింపులకుపోకుండా, పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు.

ఆవేశంలో జరిగే పొరపాట్లను సరిదిద్దుకోవాలన్నారు. కాగా, మెగా లోక్‌అదాలత్‌లో 506 క్రిమినల్ కేసులు, 8 సివిల్ కేసులు పరిష్కారమయ్యాయి. రూ.3,36,500 నగదు జరిమానా రూపంలో రాగా, ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానా కు జమ చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాద బీమా కేసుల్లో రూ.85లక్షలు మృతుల కుటుంబీకులకు ఇచ్చేందుకు ఇన్సూరెన్స్ కంపెనీలు అంగీకరించాయి. కార్యక్రమంలో జక్కుల వీరయ్య, కాలువ శ్రీనివాస్, రాఘవరావు, క్రాంతికుమార్, వెంకటేశ్వర్లు, సురేష్, బాషా, అంజయ్య, ఎస్‌ఐ ముత్తయ్య, మహేష్, రమణారెడ్డి, శ్రీనునాయక్, సైదా, వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మృగశిర కార్తె సందడి

చేపలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిన ప్రజలు



సూర్యాపేటటౌన్, జూన్ 8: జిల్లాలో శనివారం మృగశిర కార్తె సందడి నెలకొంది. మృగశిర కార్తె సందర్భంగా చేపలు తినడాన్ని ప్రజలు సంప్రదాయంగా భావించడంతో చేపల మార్కెట్లలో కోలాహలం కన్పించింది. కాగా, చేపలకు డిమాండ్ ఏర్పడటంతో కొంత మంది విక్రయదారులు ధరలను పెంచారు. సాధారణ రోజుల్లో బొచ్చ కిలో రూ.180 ఉండగా, మృగశిర కార్తె సందర్భంగా రూ.220, రవ్వ రూ.160 నుంచి రూ.180, కొర్రమేను రూ.350 నుంచి రూ.380, రూ.400 వరకు విక్రయించారు. జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లోని చేపల మార్కెట్, తాళ్లగడ్డలో. కుడకుడ రోడ్డు ప్రాంతంలో, ఖమ్మం క్రాస్‌రోడ్డు ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాల్లో చేపలను వ్యాపారులు విక్రయించారు. కొంత మంది చిరు వ్యాపారులు బండ్ల మీద, బుట్టల్లో చేపలు తెచ్చి విక్రయించారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు చేపల కొనుగోళ్ల సందడి ఏర్పడింది.

మట్టపల్లిలో భక్తవత్సలుడికి గరుడోత్సవం

మఠంపల్లి,జూన్ 8: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మట్టపల్లి లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో శనివారం రాజ్యలక్ష్మీ,చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహుడి నిత్యాకల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు, ఉదయం హోమాధికాలు నిర్వహించారు.కల్యాణ మూర్తులను పరిణయోత్సవ వేదికపై అధిష్ఠించి పుణ్యాహవాచనం, పాదప్రక్షాళన మధుపర్క పూజలు చేశారు. అనంతరం మాంగల్యధారణ, యజ్ఞోపవీతధారణ అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ తిరువీధుల్లో స్తంభోద్భవుడిని ఊరేగించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు.కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ విజయ్‌కుమార్, మట్టపల్లిరావు,ఈవో సిరికొండనవీన్, ఆలయ అర్చకులు, పాలకమండలి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గరుడోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అంతర్‌జిల్లా దొంగ అరెస్టు

అక్కన్నపేట, జూన్ 8 : వరుస దొంగతనాలు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సిద్ధిపేట జిల్లా అక్కన్నపేట ఎస్‌ఐ తాండ్ర వివేక్ శనివారం విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలానికి చెందిన సిరిగిరి సాయిబాబా అలియాస్ సాయికుమార్ తాగుడు, గంజాయికి బానిసై దొంగతనాలను అలవాటుగా చేసుకున్నారు. గతంలో కరీంనగర్, వరంగల్, నల్లగొండ, హుజూర్‌నగర్, జనగాం, భువనగిరి ప్రాంతాల్లో చోరీలు చేసిన జైలు వెళ్లి వచ్చాడు. అయినా బుద్ధిమారక గత నెల 19వ తేదీన అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామంలో కనకయ్య ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశాడని ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా గంగాధర మండలం వెంకటాయపల్లి స్టేజీ వద్ద యూనికాన్ బైక్‌ను, మల్లంపల్లి గ్రామపాఠశాలలో నల్లాపైపులను చోరీ చేశాడని వివరించారు. అంతకపేట గ్రామంలో చోరిచేసిన సొత్తును కొండగట్టుకు వెళ్లి స్నేహితుడైన గంధం అర్జున్‌తో కలిసి విక్రయించాలని చెప్పగా అర్జున్ రూ.60 వేలకు విక్రయించి అందులో రూ.10 వేలు తీసుకుని మిగిలిన డబ్బును సాయిబాబాకు ఇచ్చాడు. ఆ డబ్బులను అవసరాలకు, జల్సాలకు సాయిబాబా ఖర్చు చేశాడు. శనివారం ఉదయం ఐదు గంటల సమయంలో భార్యాపిల్లలను చూసేందుకు చోరీచేసిన బైక్‌తో వస్తుండగా పట్టుకుని విచారించినట్లు తెలిపారు. విచారణలో చోరీ చేసినట్లు తేలడంతో అతడి నుంచి 30 గ్రాముల బంగారం, 166 గ్రాముల వెండి, యూనికాన్ బైక్‌ను, వెయ్యి రూపాయల నగదు స్వాధీనం చేసుకుని హుస్నాబాద్ కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎల్‌వోసీ చెక్కు అందజేత

వలిగొండ, జూన్ 8 : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన చెవ్వ మీనయ్యకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి శనివారం రూ.2.50 లక్షల ఎల్‌వోసీ చెక్కును అందజేశారు. ప్రస్తుతం మీనయ్య అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన వైద్య ఖర్చులకు చెక్కును ఎమ్మెల్యే ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, నాయకులు వెంకటేశం, యాదయ్య, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో.. తస్మాత్ జాగ్రత్త

- బ్యాంకు ఖాతా, ఏటీఎం, డెబిట్ కార్డు వివరాలు చెబితే డబ్బులు ఖాళీ
- అధికారులను వదలని సైబర్ నేరగాళ్లు
- జిల్లాలో ఇప్పటికే పలువురు బాధితులు

సూర్యాపేటటౌన్, జూన్ 8: ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలతో ప్రజల నుంచి డబ్బులు దోచుకోవడం వివిధ రకాలుగా జరుగుతోంది. ముఖ్యంగా స్మార్ట్ ఫోన్‌లనే లక్ష్యంగా చేసుకుని ఆఫర్లు ఉన్నాయని, కేవైసీ చేసుకోవాలని మెసేజ్‌ల రూపంలో లింక్‌లు పంపుతున్నారు. ఇదేసమయంలో ఏమాత్రం లింక్‌లు క్లిక్ చేసినా బ్యాంకులో నగదు గల్లంతవుతోంది. గతంలో కొంతమంది ఇళ్లలోకి చొరపడి చోరీలకు పాల్పడి నగదు, బంగారు అభరణాలను చోరీ చేస్తుంటారు. మరికొందరు నగదును తీసుకెళ్తుండగా ఏమార్చి అపహరిస్తున్నారు. ఇలా కాకుండా ఇటీవల నేరగాళ్లు సైబర్ నేరాలకు తెరలేపారు. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు ఉన్న కొంతమంది వ్యక్తులు ఇలాంటి నేరాలకు పాల్పడుతూ ప్రజల నుంచి డబ్బులు కాజేస్తున్నారు. వారు ఎక్కడో ఒక చోట ఉండి ప్రజలకు ఫోన్లు, మెసెజ్‌లు పంపి వారి వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలను మాయమాటలతో తెలుసుకొని మోసగిస్తున్నారు. బ్యాంకు ఖాతాలో నుంచి డబ్బులు పోయేంత వరకు కానీ బాధితులకు మోసపోయామని తెలియని పరిస్థితి నెలకొంది. ఇలాంటి సైబర్ నేరాలు ప్రస్తుతం సమాజంలో ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు పదే పదే చెబుతున్నా నేరాలు మాత్రం జరుగుతూనే ఉన్నాయి.

సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి. కళ్లెదుట నేరం చేసే వ్యక్తుల కంటే ఈ సైబర్ నేరగాళ్లు చేసే మోసాలు ఎక్కువయ్యాయి. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగిన వ్యక్తులు తప్పుడు చిరునామాలతో పలురకాల సిమ్‌కార్డులను కొనుగోలు చేసి, మెయిల్ అడ్రస్‌లు కూడా తప్పులుగా నమోదు చేసి నేరాలకు పాల్పడుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న తరహాలోనే నేరాలు కూడా పెరుగుతున్నాయి. నేరగాళ్లు కొత్తపంథాలో నేరాలకు పాల్పడుతున్నారు. ఈ సైబర్ నేరానికి పాల్పడే వారు అమాయక ప్రజల గుర్తింపు కార్డులను కూడా వాడుకుంటున్నారు. వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు దోచుకుంటున్నారు. ఇలాంటి వారితో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పాస్‌వర్డ్ చెబితే డబ్బులు ఖాళీ

గుర్తుతెలియని వ్యక్తులు వివిధ రకాలుగా నమ్మబలుకుతూ మోసగిస్తున్నారు. తాము బ్యాంక్‌కు సంబంధించిన అధికారులమని, లాటరీలో బహుమతి వచ్చిందని, కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నామని లేదంటే తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని, పలు ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మపలుకుతూ ప్రజల నుంచి బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం, డెబిట్, క్రెడిట్‌కార్డుల వివరాలు, పాస్‌వర్డ్, బ్యాంకు ఓటీపీ వివరాలు అడుగుతున్నారు. వాటి ద్వారా వారికున్న సాంకేతిక పరిజ్ఞానంతో బ్యాంకు ఖాతాల్లో నిల్వ ఉన్న నగదును ఆన్‌లైన్‌లోనే కాజేస్తున్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్ కొనుగోలు, విక్రయాల విషయంలో కూడా మోసగిస్తున్నారు. ఇలా ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు ఈవిధంగా నమ్మపలికినా, సెల్‌ఫోన్‌కు, మెయిల్ అడ్రస్‌కు మెసెజ్‌లు పంపినా, డబ్బులు కాజేసే అవకాశాలు ఉన్నాయి.

మాయమాటలతో నేరాలు

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఇప్పటికే సూర్యాపేట జిల్లాలో కొంతమంది ప్రజలు చిక్కుకున్నారు. అమాయకులను మభ్యపెడుతూ అందినకాడికి దోచుకుంటునే ఉన్నారు.సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్లు రెండు ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే ప్రయత్నం చేశారు. ఎస్పీ రాహుల్‌హెగ్డే పేరుతో సైబర్ నేరగాళ్లు సూర్యాపేటకు చెందిన ఒక వ్యక్తికి నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి ఎస్పీ రాహుల్‌హెగ్డే పేరుతో ఆరోగ్యం ఎలా ఉందని టెస్ట్‌మెసేజ్ చేశారు. నా ఫ్రెండ్ సీఆర్‌పీఎఫ్‌లో పనిచేస్తున్నాడని అతను రూం ఖాళీ చేస్తున్నాడని అతిచౌకగా ఫర్నిచర్ ఇస్తున్నాడని వీలైతే తీసుకో అని మెసేజ్ పంపించాడు. నాఫ్రెండ్ ఫోన్ చేస్తాడని మొబైల్‌నెంబర్ పంపించమని ఎస్పీ పేరుతో సదరు వ్యక్తికి టెస్టు మెసేజ్ చేశారు. ఆ తర్వాత కాసేపటికి సీఆర్‌పీఎఫ్ ఉద్యోగిని అంటూ ఫోన్ చేయడంతో పాటు కొంతనగదును ముందుగా ఆన్‌లైన్‌లో పంపించాలని చెప్పడంతో సదరు వ్యక్తికి కొంత అనుమానం వచ్చి ఎస్పీ పీఆర్‌వోకు సమాచారం ఇవ్వడంతో పీఆర్‌వో ఎస్పీ దృష్టికి తీసుకుపోగా అవి నకిలీ ఫేస్‌బుక్‌లు అకౌంట్లు అని, ఎలాంటి నగదు పంపవద్దని ఎస్పీ చెప్పారు. అదేవిధంగా డీఎంహెచ్‌వో కోటాచలం కొద్ది నెలల క్రితం సైబర్ నేరగాళ్ల వలలోచిక్కాడు. కలెక్టర్ పేరుతో ఫేస్‌బుక్ ద్వారా మెసేజ్ చేసి నగదును కాజేశారు. అదేవిధంగా జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారులను, ఉద్యోగులను, అధికారులను, అమాయకులను ఈ మాయగాళ్లు మోసం చేస్తున్నారు. జిల్లాలో ఏడాది నుంచి 641 సైబర్ కేసులు నమోదుకాగా రూ.1.88 కోట్లు నగదును కాపాడగలిగారు.

ఖాతా వివరాలు చెప్పొద్దు



ప్రజలు గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు ఏ పరిస్థితుల్లో చెప్పొద్దు. వాటి ద్వారా కొంతమంది సైబర్ నేరగాళ్లు మోసగించి డబ్బులు కాజేస్తున్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్స్ ఉన్నారు. ఈవిధంగా ఎవరైనా మోసపోయినట్లు గుర్తిస్తే 24 గంటల్లోపు సంబంధిత పోలీస్ స్టేషన్లలో సమాచారమివ్వాలి. ఆవిధంగా సమాచారం ఇచ్చిన వారి బ్యాంకు ఖాతాను నిలుపుదల చేయించి ఖాతా నుంచి డబ్బులు పోకుండా చూస్తాం. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారమివ్వాలి.

● రాహుల్‌హెగ్డే, ఎస్పీ, సూర్యాపేట జిల్లా

గృహవినియోగదారుడికి గ్రామ వీధిదీపాల బిల్లు

- ఒక్కనెలకే రూ.33,303 బిల్లు
- సరిచేస్తామని చెప్పి రెండు నెలలు



వినియోగదారుడికి వచ్చిన రూ.33,303 వేలు

నార్కట్‌పల్లి, జూన్ 8: ఓ సాదాసీదా గృహ విద్యుత్ వినియోగదారుడికి విద్యుత్ శాఖ కరెంటు బిల్లు 'షాక్' ఇచ్చింది. మహా అయితే నెలకు రూ.200లు లేదా రూ.300 బిల్లు వచ్చే ఆ ఇంటికి ఏకంగా రూ.33,303 బిల్లు వేసింది. బిల్లు చూసిన వినియోగదారుడు ఇదేంటని విద్యుత్ సిబ్బందిని నిలదీస్తే సరిచేస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా, యథావిధిగా ప్రతీ నెలా బకాయి కింద వస్తూనే ఉంది. ఎన్నికల వాగ్దానాల అమలులో భాగంగా 200 యూనిట్ల వరకు ప్రభుత్వం ఓ వైపు ఉచిత కరెంటు కింద 'జీరో' బిల్లును ఇస్తుండగా విద్యుత్ శాఖ నిర్వాకంతో బాధిత వినియోగదారునికి మాత్రం ఇంకా బిల్లు బకాయి చూపిస్తూనే ఉంది. ఈ విచిత్రం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బీ.వెల్లెంలలో వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం విశ్వనాథుల పిచ్చయ్యకు గ్రామంలో చిన్నపాటి ఇల్లు ఉంది. 4050700328 పేరిట సర్వీస్‌నెంబర్‌తో గృహ విద్యుత్ కనెక్షన్ గత డిసెంబరులో ఇంటివెనక చెట్లకొమ్మలను నరికే క్రమంలో సర్వీస్ వైర్లు తెగిపోయాయి. దీంతో కొత్త సర్వీస్‌వైరు తెచ్చుకోగా విద్యుత్ సిబ్బంది తిరిగి ఆ ఇంటికి కనెక్షన్ ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇక్కడే జరిగిన పొరపాటుతో మీటరు విష్ణుచక్రంలా తిరిగి కరెంటు బిల్లు ఒక్క నెలలోనే రూ.33,303 వచ్చింది. ఈ విషయాన్ని పిచ్చయ్య విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాడు. స్తంభం ఎక్కి పరిశీలించగా గ్రామంలో వీధిదీపాల వైరుకు మీటరు కనెక్షన్ ఇచ్చినట్లు గుర్తించారు. ఈ కారణంగానే బిల్లు ఎక్కువగా వచ్చినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లారు. బిల్లును రద్దు చేయాలంటూ సదరు అధికారి శాఖా అకౌంట్స్ విభాగానికి లేఖ రాశారు. ఇది జరిగి రెండు నెలలైనా బిల్లు బకాయి అలాగే వస్తుండటంతో హెల్పర్‌ను నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడని బాధితుడు ఆరోపిస్తున్నారు.

వచ్చే నెల బిల్లులోనైనా సరిచేస్తాం

బాధిత విద్యుత్ గృహ వినియోగదారుడు విశ్వనాథుల పిచ్చయ్య ఇంటి విద్యుత్ వాడకానికి సంబంధించి బిల్లు ఎక్కువగా వచ్చినట్లు మా దృష్టికి వచ్చింది. మీటరులో సాంకేతిక లోపం ఉన్నట్లు గుర్తించి మీటరు మార్చాం. ఎక్కువగా వచ్చిన బిల్లును సరిచేయాలని సూచిస్తూ అకౌంట్స్ విభాగానికి లెటర్ కూడా రాశాం. బహుశా ఎన్నికల కారణంగా ఆలస్యం అయ్యిండొచ్చు. వచ్చే నెల బిల్లులోనైనా సరిచేసేలా చర్యలు తీసుకుంటా.

\- కే.చంద్రశేఖర్‌రావు, ఏఈ

రామోజీరావు మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు

నల్లగొండ / హుజూర్‌నగర్, జూన్ 8 : ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి మీడియా రంగానికి తీరని లోటని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో రామోజీరావు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు.

తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరని లోటు : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

పద్మవిభూషణ్ రామోజీరావు మృతి తెలుగురాష్ట్రాల ప్రజలకు తీరని లోటని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సామాన్య కుటుంబంలో జన్మించిన రామోజీరావు స్వశక్తితో ఎదిగి అక్షరశిల్పిగా మారారని, తెలుగువెలుగుతో అమ్మ భాషకు వన్నె తెచ్చేందుకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

గొప్ప మాతృభాషా ప్రేమికున్ని కోల్పోయాం: జగదీష్‌రెడ్డి

తెలుగు రాష్ట్రాలు గొప్ప మాతృభాషా ప్రేమికుడు రామోజీరావును కోల్పోయాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి హైదరాబాద్‌లో రామోజీరావు పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష పట్ల రామోజీరావుకు ఉన్న ప్రేమ, మమకారం, నిబద్ధతను జగదీష్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. రామోజీరావు మృతికి తీవ్రవిచారం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబసభ్యులకు సంతాపం, సానుభూతి ప్రకటించారు.



రామోజీరావు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

భువనగిరి అర్బన్, జూన్ 8 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి క్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు జరిగాయి. సుప్రభాత సేవతో గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను మేల్కొలిపిన అర్చకస్వాములు సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకారమండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అదేవిధంగా అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేకవేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా జరిపారు. ఈ ఆలయాల్లో సాయంత్రం వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనుబంధంగా కొనసాగుతున్న శివాలయంలో రామలింగేశ్వరస్వామి వారికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్యరుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి.

సందడిగా ఉభయ క్యూలైన్లు

యాదగిరిగుట్ట దివ్యక్షేత్రం స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులతో యాదగిరికొండపై సందడినెలకొంది. వేసవి సెలవులు ముగిసే చివరి వారాంతపు సెలవులతో పాటు రెండో శనివారం కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు పిల్లాపాలతో రాష్ట్రం నలుమూలల నుంచి శనివారం తరలివచ్చారు. అధికసంఖ్యలో వాహనాలపై రావడంతో ఉభయ దర్శన క్యూలైన్లు కిక్కిరిసాయి. ప్రత్యేక దర్శనానికి గంట, ధర్మదర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఆలయ తిరువీధులు, పరిసరాలు భక్తుల తాకిడితో సందడిగా మారాయి. ప్రసాద కౌంటర్లు, దుకాణా సముదాయాలు, ఆలయ ఉత్తర దిశలోని మాఢవీధులో షెడ్డు కింద సేదతీరారు. కాగా, సుమారు 40వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ఉభయ క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు రద్దీకి సరిపడా బస్సులు నడపకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.56,14,368 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, బ్యాటరీ వాహనాలతో పాటు వీల్‌చైర్లు ప్రొటోకాల్ కార్యాలయంలో ఏర్పాటుచేశారు. ఎలాంటి రుసుం లేకుండా వివరాలు నమోదు చేసుకొని దర్శనం ముగిసిన వెంటనే తిరిగి అదే కార్యాలయంలో అప్పగించాలని ఈవో తెలిపారు.



ఆలయంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న పూజారి, ప్రసాద కౌంటర్ వద్ద దారిలో భక్తుల రద్దీ

భార్య వేధింపులు తట్టులేక ఆత్మహత్య

హుజూర్‌నగర్, జూన్ 8 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో భార్య, అత్తింటి వారి వేధింపులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీతారాంనగర్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న చిట్టిప్రోలు రంజిత్(35) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. భార్య డీలర్‌గా పనిచేస్తోంది. కాగా భార్యభర్తల మధ్య కొంతకాలంగా మనస్పర్థలు రాగా ఇరువురు ఘర్షణ పడుతున్నారు. గత కొంతకాలంగా భార్య, ఆమె కుటుంబసభ్యులు రంజిత్‌ను వేధింపులకు గురిచేస్తుండటంతో మనస్తాపానికి గురైన రంజిత్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం ఉరేసుకున్నాడు. సాయంత్రం నాలుగు గంటలకు ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. కాగా రంజిత్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రంజిత్ తల్లి చిట్టిప్రోలు పద్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి విచారణచేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



రంజిత్ (ఫైల్)

'తెలంగాణలో కాంగ్రెస్‌కే ప్రజల మద్దతు'

సూర్యాపేటటౌన్, జూన్ 8: రాష్ట్రంలో ఏ ఎన్నికలైనా కాంగ్రెస్‌కే ప్రజల మద్దతు ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు కొండగడుపుల సూరయ్య అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజల మద్దతు కాంగ్రెస్‌కే ఉందన్నారు. స్థానిక సంస్థాగత ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపన్నారు. పదేళ్లలో రాష్ట్రంలో బీఆర్ఎస్ చేసిన అరాచకపు పాలనను ప్రజలు తరిమికొట్టారన్నారు. నిరుపేదల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు చేరుతుందన్నారు. ప్రశ్నించే గొంతుక ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు బ్రహ్మరథం పట్టారని అన్నారు.

విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి



చిలుకూరు : రామాపురంలో గేదె కళేబరం

ఆత్మకూర్(ఎస్), జూన్ 8: మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన పిడమర్తి కవిత, పిడమర్తి జ్యోతి, భద్రమ్మలకు చెందిన మూడు గేదెలను మేతకు వదిలారు. మూడు రోజుల క్రితం వచ్చిన ఈదురు గాలులకు పొలంలో విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయి. గేదెలు మేతకు వెళ్లిన గేదెలు తెగడపిన విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. ఒక్కో గేదె విలువ రూ.70 వేలకు పైగా ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పాడి గేదెలు మృతిచెందడంతో తాము ఉపాధి కోల్పోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

చిలుకూరు: మండలంలోని రామాపురంలో విద్యుదాఘాతానికి గురై గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన వేముల లింగయ్య పాడి గేదె మేత కోసం పొలాల్లోకివెళ్లింది. తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది.

దూద్యాతండాలో గొర్రెపోతుల అపహరణ

చిలుకూరు, జూన్ 8: మండల పరిధిలోని దూద్యాతండా గ్రామంలో గొర్రె పోతుల దొంగతనం జరిగింది. బాధితుడు గుగులోతు మంగ్తా తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో ముత్యాలమ్మ పండుగ సందర్భంగా మంగ్తా గొర్రెపోతులు కొన్నాడు. శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు తన ఇంట్లో ఉన్న మూడు గొర్రెపోతులను దొంగిలించినట్లు ఆయన తెలిపారు. వీటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని తెలిపాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

తీన్మార్ మల్లన్న గెలుపు సంబరాలు



సూర్యాపేటలో కేక్ కట్ చేస్తున్న న్యాయవాదులు

సూర్యాపేటఅర్బన్, జూన్ 8: నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం హర్షనీయమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్‌సెల్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి అన్నారు. తీన్మార్ మల్లన్న గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తు జిల్లాకేంద్రంలోని కోర్టు చౌరస్తా వద్ద లీగల్‌సెల్ ఆధ్వర్యంలో శనివారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న గెలుపు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సీనేపల్లి సోమేశ్వర్, పోలెబోయిన నర్సయ్యయాదవ్, ఎండీ షఫిఉల్లా, దొరెపల్లి రమేష్, ఎండీ ఫరీ దుద్దీన్, గుంటూరు మధు, కొనం రఘురామయ్య, పసల బాలరాజు, ప్రకాష్, ఖాలేదు హమ్మద్, పత్తిపాక రాధాకృష్ణ, నవీన్, అనంతుల సందీప్‌గౌడ్, జోసెఫ్ రంజిత్, సుధాకర్‌గౌడ్, నీలా లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మోతె: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న తీన్మార్ మల్లన్న గెలుపు అభినందనీయమని సామాజికవేత్త, బాలల హక్కుల పర్యవేక్షకుడు బొడ్డు సాలయ్యగౌడ్ అన్నారు. మల్లన్న విజయం సాధించడంతో మండల కేంద్రంలో శనివారం కేక్‌కట్ చేశారు. ప్రజాసమస్యలతో పాటు నిరుద్యోగుల తరుపున చట్టసభలో మల్లన్న మాట్లాడుతారన్నారు.

'నీట్' ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేటఅర్బన్, జూన్ 8: నీట్ పరీక్ష ఫలితాల్లో కీసర బండ్లగూడలోని శ్రీఆద్య మెడికల్ అకాడమి విద్యార్థులు ప్రతిభ కనబర్చారని డైరెక్టర్ జీపీ. నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌమ్య 720మార్కులకు 600 మార్కులు, స్నేహలతారెడ్డి 720మార్కులకు 584మార్కులు సాధించారని తెలిపారు. 22మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు, 45మంది విద్యార్థులు 400కిపైగా మార్కులు సాధించారని వివరించారు. తమ అకాడమిలో శిక్షణ తీసుకున్న ప్రతి ఇద్దరిలో ఒకరు ఉచితంగా మెడికల్ సీట్ సాధించారని తెలిపారు.

నాట్యమండలి నూతన కమిటీ ఎన్నిక

మునగాల రూరల్, జూన్ 8: మండల పరిధిలోని రేపాల గ్రామానికి చెందిన కళాకారుడు, గ్రామవెలుగు నాట్యమండలి వ్యవస్థాపకుడు కోదాటి లక్ష్మీనరసింహారావు స్థాపించిన గ్రామవెలుగు నాట్య మండలి నూతన అధ్యక్ష, కార్యదర్శులను, పాలకవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మొగిలిచర్ల సత్యనారాయణ, సారిక పెద్దరామయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామవెలుగు నాట్య మండలిని గ్రామప్రజలకు అంకితం చేసి కళాకారులను తీర్చిదిద్దిన ఘనత కేఎల్ నరసింహారావుది అని అన్నారు. నూతన కళాకారులను ప్రోత్సహించి గ్రామ వెలుగు నాట్య మండలిని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మునగాల రూరల్, జూన్ 8: స్థానిక 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



మోతె : సిరికొండ గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



మఠంపల్లిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



తిరుమలగిరి : జలాల్‌పురంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నేరేడుచర్ల, జూన్ 8: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని నేరేడుచర్ల జడ్పీటీసీ రాపోలు నర్సయ్య అన్నారు. ఎంఈవో ఛత్రునాయక్‌తో కలిసి ఆయన ప్రభుత్వం నుంచి వచ్చిన పుస్తకాలు, నోట్ పుస్తకాలను శనివారం ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు శ్రీను, సత్యనారాయణ, నవీన్‌కుమార్, వీరారెడ్డి, సిబ్బంది ప్రతాప్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: బడిఈడు పిల్లలను బడికి పంపాలని జలాల్‌పురం స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ జి. అశోక్ అన్నారు. మండలంలోని జలాల్‌పురం గ్రామంలో శనివారం జరిగిన బడిబాట కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, పాఠశాల యూనిఫాం ప్రభుత్వం ఇస్తుందన్నారు. దీనిని ఉపయోగించుకొని చదువులో రాణించాలన్నారు. గ్రామాల్లో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి, ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉమారాణి, షరీఫ్, రాములు, సత్యనారాయణ అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు కృషి చేయాలని, బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీపీ ఎం. పార్వతి అన్నారు. మండలకేంద్రంలో శనివారం బడిబాట ర్యాలీని ప్రారంభి మాట్లాడుతూ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో పాటు ప్రభుత్వం ఉచిత నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలు బడిబాట కార్యక్రమాన్ని నిర్వ హించారు. అనంతరం ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాలను ఎంఈవో ఛత్రునాయక్ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకవీడు: ప్రభుత్వం ఉచితంగా అందజేసిన పాఠ్యపుస్తకాలను శనివారం పాలకవీడులో ఎంపీపీ భూక్యాగోపాల్ ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఛత్రునాయక్, ప్రధానోపాధ్యాయులు శ్రీరాంరెడ్డి, వెంకటేశ్వరావు, వెంకటరెడ్డి, గోపాల్, నాగార్జున్, సంధ్యారాణి, సీఆర్పీలు వెంకటేశ్వర్లు, మంగ్తానాయక్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం: బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించాలని కోరుతూ మండలంలోని కొత్త చాకిరాలలో బడిబాట కార్య క్రమం నిర్వహించారు. బడి బయటఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రవీందర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మోతె: బడి ఈడు పిల్లలను బడులకు పంపించాలని సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు దామళ్ల కోటేశ్వరరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులతో కలిసి గ్రామంలో బడి ఈడు పిల్లలను బడులకు పంపించాలని ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, నోట్‌బుక్కు యూనిఫాం ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నేరేడుచర్లలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ

రాజీమార్గమే రాజమార్గం : జడ్జి



కోదాడలో మాట్లాడుతున్న జడ్జి శ్యాంసుందర్



లోక్‌అదాలత్‌లో ఒక్కటైన జంటను అభినందిస్తున్న జడ్జి ఫర్హీనా కౌసర్

కోదాడ, జూన్ 8: కక్షిదారులకు రాజీమార్గమే రాజమార్గమని కోదాడ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. శ్యాంసుందర్ అన్నారు. కోదాడ కోర్టులో శనివారం లోక్ అదాలత్‌ను ప్రారంభించి మాట్లాడారు. సుదీర్ఘకాలంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి కార్యక్రమన్నారు. లోక్ అదాలత్‌తో సమయంతో పాటు ధనం ఆదా అవుతుందన్నారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడంతో గ్రామాల్లో శాంతి భద్రతలు మెరుగుపడతాయన్నారు. లోక్ అదాలత్‌లో 3,847 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. రూ.16,87,920 జరిమానాలు విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ సీహెచ్ సత్యనారాయణ, ఎస్ఆర్‌కె మూర్తి, రామిరెడ్డి, మురళి, రాజన్న, పవన్, మల్లికార్జున్‌రావు, వెంకట్రావు, నాగేశ్వరరావు, కృష్ణయ్య, పాషా, జావీద్, నర్సయ్య, వెంకటేశ్వర్లు, గోవర్ధన్, పాషా, శరత్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: రాజీమార్గమే రాజమార్గమని తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఫర్హీనా కౌసర్ అన్నారు. లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా తుంగతుర్తి కోర్టులో పలు కేసులను పరిష్కరించారు. 174 సాధారణ కేసులు, 1800 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 923 పెట్టీ కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కక్షిదారులందరూ సత్వర న్యాయంకోసం లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మనస్పర్థలతో విడిపోయిన దంపతులను లోక్ అదాలత్‌లో ఒక్కటి చేశారు. తిరుమలగిరి మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన పొన్నాల కార్తీక్‌కు నూతనకల్ మండలం ఎంకెపల్లి గ్రామానికి చెందిన మౌనికకు 2021లో వివాహం జరిగింది. చిన్న చిన్న తగాదాలు ఏర్పడి మనస్పర్థలతో విడిపోయారు. దీంతో మౌనిక నూతనకల్ పోలీస్‌స్టేషన్‌లో తన భర్తపై ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి ఫర్హీనా కౌసర్, కోర్టు సూపరింటెండెంట్, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సత్యనారాయణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీలత కౌన్సిలింగ్ ఇచ్చారు. తాము సమక్షంలో కలిసి జీవిస్తామని పూలదండలు మార్చుకున్నారు. కార్యక్రమంలో అదాలత్ సభ్యులు గుగులోతు రాజారాం, బానోతు ప్రతాప్ పాల్గొన్నారు.

అధికారులతో నేడు, రేపు మంత్రి ఉత్తమ్ సమీక్ష సమావేశాలు

హుజూర్‌నగర్, కోదాడ రూరల్, జూన్ 8 : పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖ అధికారులతో ఆదివారం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుండి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి 5 గంటలకు పట్టణంలోని ఫణిగిరి గట్టు వద్ద నిర్మాణంలో ఉన్న మోడల్ కాలనీ ఇళ్లను పరిశీలించనున్నారు. అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని పీఆర్ఓ వెంకటరెడ్డి కోరారు.

లిఫ్ట్‌లపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం

హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలతో పాటు సాగర్ ఎడమ కాలువపై ఏర్పాటు చేసిన లిఫ్ట్‌లపై ఈనెల 10న నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటుచేసినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 35, కోదాడ నియోజకవర్గంలో 19 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయన్నారు. వీటితో పాటు సాగర్ ఎడమ కాలువ, కృష్ణా నదిపై ఉన్న లిఫ్ట్‌లు, మూసీనది, పాలేరు వాగుపై ఉన్నటువంటి లిఫ్ట్‌లపై సమీక్షించి వాటి నిర్వహణకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా ఉన్న సమయంలో సుమారు 50కి పైగా లిఫ్ట్‌లను నిర్మించినట్లు తెలిపారు. కొత్త లిఫ్ట్‌ల పనుల పురోగతికి సంబంధించి అధికారులతో సమీక్ష చేస్తామన్నారు. లిఫ్ట్‌ల కింద ఉన్న రైతులు, అధికారులతో ఈనెల 10న కోదాడలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తుంగతుర్తి, జూన్ 8: తుంగతుర్తి మండలంలోని వెంపటి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమయ్య, మల్లారెడ్డి, జనార్ధన్, రవికుమార్, ప్రభాకర్, వేణు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రామోజీరావు జీవితం ఆదర్శనీయం



కోదాడలో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ రూరల్, జూన్ 8: రామోజీరావు జీవితం ఆదర్శమని కాకతీయ కమ్మ సంఘం నాయకులు అట్లూరి హరిబాబు, కెఎల్ఎన్‌రావు, పొనుగుపాటి అశోక్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలోరామోజీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టిన రామోజీ రావు భారతదేశం గర్వించదగిన వ్యక్తిగా ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో శాఖమూరి రవికుమార్‌చౌదరి, జనార్దన్, వాసుదేవరావు, పెందుర్తి భాస్కర్, సత్యనారాయణ, చిన్నం సురేష్, చిన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ మీడియా అధినేత రామోజీరావు మృతి బాధాకరమని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాసు అన్నారు.

కోదాడ: రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరనిలోటని పార్టీల రాజకీయ నాయకులు అన్నారు. పబ్లిక్‌క్లబ్ ఆడిటోరియంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాసమస్యల సాధనతో పాటు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో, ఉద్యోగాల కల్పనలో రామోజీరావు సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, వామపక్షాల పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. టీయూడబ్ల్యూజే నాయకులు రామోజీరావు మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.

కోదాడటౌన్: అక్షరయోధుడు చెరుకూరి రామోజీరావు అని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్తినేని సైదేశ్వరరావు అన్నారు. కోదాడలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పత్రిక అధినేతగా, వ్యాపారవేత్తగా, సినిమా నిర్మాతగా రామోజీరావు అనేకరంగాల్లో రాణించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ కోదాడ నియోజకవర్గ నాయకులు చాపల శ్రీనివాసరావు, ఉప్పుగండ్ల శ్రీనివాసరావు, సజ్జారామోహన్‌రావు, ఉన్నం హనుమంతురావు, సోమపంగు సహదేవ్, చావా హరినాద్, ముత్తవరపు కోటేశ్వరరావు, మాదాల రాంబాబు, పొందూరి వెంగళరావు, గద్దె వెంకటేశ్వరరావు, బండారుపల్లి వెంకటేశ్వరరావు, సిరిపురపు బోస్, నర్రా రమేష్, పొందూరి కార్తీక్, మన్నే శ్రీరామ్ పాల్గొన్నారు.

సూర్యాపేటఅర్బన్: రామోజీరావు మృతిచెందడం బాధాకరమని మనం వికాసవేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్ అన్నారు. జిల్లాకేంద్రంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలవు వేసి నివాళుర్పించారు. ఐదు దశాబ్దాల పాటు ప్రచార, ప్రసార, వాణిజ్య, వ్యాపార, సినిపరిశ్రమలపై రామోజీరావు తనదైన ముద్ర వేశారన్నారు.

చిలుకూరు: రామోజీరావు మృతి పత్రికారంగానికి తీరనిలోటని ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడు మల్లం వెంకటేశ్వర్లు అన్నారు. ప్రెస్‌క్లబ్ వద్ద రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు దొడ్డా శ్రీధర్, గోవిందాచారి, కొడారు బ్రహ్మం, సైదులు, శ్రీనివాసరావు, వీరబాబు, కొల్లు నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ అల్సకాని జనార్దన్, అల్సకాని వెంకటయ్య, కోటేష్, వెంకటి, కొండా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

డప్పు సుధాకర్ మృతి బాధాకరం



ఓదారుస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నాగారం, జూన్ 8: మండలకేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, సాంస్కృతిక సారథి కళాకారుడు చిప్పలపల్లి సుధాకర్ మృతి బాధాకరమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం గుండెపోటుతో మృతిచెందిన సుధాకర్ భౌతికకాయానికి శనివారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ గొప్ప కళాకారుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాకారులు ఏపూరి సోమన్న, గిద్దె రామనర్సయ్య, వేముల పుష్ప తదితర కళాకారులు నాగారం చేరుకుని సుధాకర్ భౌతికకాయానికి పూలమాలవు వేసి నివాళులర్పించారు. ఏపూరి సోమన్న, గిద్దె రామనర్సయ్యలు సుధాకర్ అకాల మరణంపై పాటలు పాడారు. సుధాకర్ అంత్యక్రియలు కళాకారులు ఆటపాటలతో ఊరేగింపుగా అంతిమయాత్ర నిర్వహించారు. సుధాకర్ కుటుంబానికి ఎమ్మెల్యే వీరేశం రూ.20వేలు, జడ్పీటీసీ కడియం ఇందిరా పరమేశ్వర్ రూ.10వేలు, సాంస్కృతిక కళాకారులు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. నివాళుర్పించిన వారిలో జడ్పీటీసీ కడియం ఇందిరాపరమేశ్వర్ తదితరులు ఉన్నారు.

మృగశిర కార్తె సందడి



గరిడేపల్లిలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



సూర్యాపేటలో చేపల విక్రయాలు

నేరేడుచర్ల, జూన్ 8: మృగశిర కార్తె ఆరంభమయ్యింది. రైతులకు తొలకరి పులకరింపులతో నారుమళ్లు దున్నడం ప్రారంభించారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో రైతులు ఈసారి ముందస్తుగానే వరి సాగు సమాయత్తవుతున్నారు. మృగశిర రోజు చేపలు తినడం ఆనవాయితీ కావడంతో నేరేడుచర్లలో చేపల అమ్మకాలు భారీగా సాగాయి.

గరిడేపల్లి: మృగశిర కార్తె రోజు ప్రజలు చేపలు కొను గోలు చేసేందుకు ఆసక్తి చూపారు. ఉదయం 6గంటల నుంచి శని వారం గరిడేపల్లి మండలకేంద్రంలో రోడ్డు పక్కన గల చేపల మార్కెట్‌లో రద్దీ ఏర్పడింది. చేపలు విక్రయదారులు కిలో రూ.200ల నుంచి రూ. 240 వరకు వసూలు చేశారు. సాధారణంగా కిలో రూ.160లకే దొరికే చేపలు మృగశిర కార్తె కావడంతో రద్దీ ఏర్పడడంతో చేపల రేటు పెంచినట్లు కొనుగోలు దారులు తెలిపారు.

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల పరిదిలోని అన్ని గ్రామాల్లో శనివారం మృగశిరకార్తెను ఘనంగా నిర్వహించారు. చేపల కోసం అన్ని గ్రామాల్లో ప్రజలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు.

బూరుగడ్డలో వీధి దీపాల ఏర్పాటు



వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు

హుజూర్‌నగర్ రూరల్, జూన్ 8: మండలంలోని బూరుగడ్డ గ్రామంలో వీధి దీపాలు లేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. బూరుగడ్డ, మాచవరం గ్రామాలకు చెందిన మహాత్మా జ్యోతిరావుపూలే, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు సొంత ఖర్చులతో గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. శనివారం వీధి దీపాలను విద్యుత్ స్తంభాలకు సుమారు రూ.50వేల విలువైన వీధి లైట్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పొదిల నాగరాజు, మెరిగ మట్టపల్లి, కందుకూరి నర్సింహ, జొన్నలగడ్డ నాగరాజు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల జేఏసీ సెక్రటరీగా బాలాజీనాయక్



నియామకపత్రం అందుకుంటున్న బాలాజీనాయక్

మఠంపల్లి, జూన్ 8: మఠంపల్లి మండలంలోని గుర్రంబోడుతండాకు చెందిన ఇస్లావతు బాలాజీ తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర సెక్రటరీగా నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌యాదవ్ శనివారం ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు బాలాజీ కృతజ్ఞతలు తెలిపారు.